సహోదరులు

శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి

వీరాస్వామి సంధ్య చీకటి వేళ చంద్రయ్య ఇంటి తలుపు కొట్టినాడు. తెలుగు దినపత్రికను ఎడమ చేతితో పట్టుకునే కుడిచేతితో తలుపు తెరచి—వీరాస్వామిని లోపలికి రమ్మన్నాడు చంద్రయ్య.

"చంద్రయ్యా! మన ప్రయత్నాలన్నీ వ్యర్థమై పోయేట్లు కనబడుతున్నాయి. ఏభయిమందిని పోగు చేసుకొని—చలమయ్య ఆ ఊరు వెళ్లనే వెళ్లినాడు. మనము ఖర్చు పెట్టిన సొమ్మూ—పడిన శ్రమా వ్యర్థమైపోతాయేమో ననిపిస్తున్నది. ఏదో ఉపాయము చూసి నన్ను గట్టున పడవెయ్య" నిలువబడే చంద్రయ్య ముఖములోకి చూస్తూ అతడి రెండు భుజాలమీదా చేతులు వేశాడు వీరాస్వామి.

"చలమయ్య ఆ ఊరు వెళ్ళాడనేనా నీ భియము? నేను ఆ చలమయ్యకంటె ముందుగా – అంతకంటె ఎక్కువమంది జనముతో – తెల్లవారక ముందే వెళ్లి – నీవు కోరినంత ప్రచారము చేసివస్తే సరికదా! భారమంతా నాపైన పెట్టి – నీవు నిశ్చింతగా ఇంటికి వెళ్లు. కాని ఒక్క మాటమాత్రము మనసులో ఉంచుకో. మనకు సహాయపడుతున్న వాళ్ళకు కొస్త విరివిగా డబ్బు ఖర్చుచేయవలసి ఉంటుంది... చూసుకో...రేపు ఈ వేళవరకూ...ఎంత పని జరుగుతుందో? ఆ చలమయ్యను చూస్తేనే అంత భియపడతా వెందుకు? వాడు లెక్కపెట్టతగిన మనిషనా నీ అభిప్రాయము?" చంద్రయ్య తనతోపాటు వీరాస్వామిని కూడా మంచముమీద కూర్చోబెట్టుకొని – "ఏం వీరాస్వామీ! నా మాటమీద నీకు నమ్మకము కుదరటము లేదా?" అన్నాడు.

"లేకేం? చాలా ఉన్నది. ఆ చలమయ్య తగనివాడు. అతడివాక్కు ఎటువంటిదోగాని...ఒక్క మాటతో అందరూ అతడికి లోబడిపోతారు. చిల్లిపైస చేతిలో లేకుండానే ప్రచారము సాగించుకొని వస్తున్నాడు. ఆ జిల్లా సాంతము అతడి మాటమీద నడుస్తుందని అందరూ అనుకుంటున్నారు." అని ఒక్కసారి దీర్ఘముగా ఊపిరి తీసుకొని విడిచాడు వీరాస్వామి.

"ఇదుగో స్వామీ! నీవు ఇప్పటినుంచీ ఊరికే దిగులుపడుతూ కూర్చోకు. జయాపజయాలు మొదలు పెట్టిన దగ్గరనుండే లెక్కచూసుకుంటూ దిగులు పడకు. నేను ఆ చలమయ్య అంతు కనుక్కోనిదీ ఈసారి విడిచిపెట్టను. నీకు చేసిన వాగ్దానము ఏమాత్రము మరువను. ఆ భారమంతా నామీద ఉంచి నీవు నిశ్చింతగా ఉండు."

మంచము మీదినుండి ఇద్దరూ లేచి వాకిటి ముందుకు వచ్చి నిలువబడ్డారు. వీరాస్వామి పదినూరు రూపాయల నోట్లను రెండుసార్లు లెక్కపెట్టి చంద్రయ్యషర్టుజేబులో పెట్టి—అతడి ముఖము వంక చూశాడు.

"రేపు పని పూర్తి చేసుకొని నాదగ్గరికిరా ఇప్పుడిచ్చినవి రేపటి ఖర్చుకే లే" చంద్రయ్యముఖము చూస్తూ—మనసులో ఆలోచించుకుంటూ వీరాస్వామి వెళ్లిపోయినాడు.

ఆ జిల్లాలో మోతుబరి రైతు అయిన చలమయ్య —శాసనసభకు రంగయ్యను అభ్యర్థిగా నిలువబెట్టవలెనని తీవ్రముగా కృషిచేస్తున్నాడు. ప్రజలను సమావేశపరచి ప్రచారము చేస్తున్నాడు. ఆజిల్లా ప్రజలకు మొదటినుండీ చలమయ్యమీద అపరిమితమైన భక్తిగౌరవాలు ఉన్నాయి. ప్రజల కాతడు వరము లిచ్చే దేవతగా కనబడుతున్నాడు.

స్వతంత్రముగా ఆజిల్లాకు అభ్యర్థిగా నిలువబడదలచుకొన్న వీరాస్వామికి—చలమయ్య చేస్తూఉన్న ప్రచారమువల్ల కలవరపాటు హెచ్చినది.

'రంగయ్య తెలివికి శాసనసభా సభ్యత్వము

తక్కువైనది కాబోలు! నిజంగా సభ్యుడు కావటమే తటస్థించినట్లయితే—వాడిని పట్టపగ్గాలు ఉంటాయా? రంగయ్య! వట్టి పనికిమాలినవాడు! వాడి చదువెంత—వాడి రాజకీయపరిజ్ఞాన మెంత? నలుగురిలో నిలువబడి నాలుగుమాటలైనా మాట్లాడలేడు! అప్పు డెప్పుడో దోచిన ధనముతో—ఇప్పుడు ప్రచారము చేసుకొని—ఎన్నికలలో నిలువబడుతున్నాడు. ఒకవేళ—గెలవటమే నిజమైతే—పట్టపగలే దారులు దోయించడూ?...వీడిని గెలవనిస్తే... నేను కోటయ్య కొడుకునే కాదు!' అనుకున్నాడు వీరాస్వామి. తెల్లవార్లూ కంటికి నిద్రలేకుండా యోచించసాగినాడు. తెలతెలవారుతుండగా చిన్నకునుకు పట్టినది. ఆ పట్టే పట్టని నిద్రలో వీరాస్వామి కంటికి చంద్రయ్య ప్రత్యక్షమైనాడు. మెలికలు తిరిగిన వెంట్రుకలతల. స్వదేశీ వస్త్రధారణమూ—పట్నవాసపు పాపోసులూ—చేతిలో కర్ర. ముఖము పైకెత్తిచూస్తేనేగాని చూపందని విగ్రహము—ముఖముమీద చిరునవ్వు. టకటక తలుపుకొట్టి 'స్వామీ! అన్నిటికీ నేనున్నానుగా!' అని చంద్రయ్య చెప్పినట్లనిపించింది వీరాస్వామికి.

చంద్రయ్య! పదిమంది గ్రామస్థులకు జవాబు చెప్పగల దేహదారుఢ్యము కలవాడు. మాటలతో ప్రజల నాకర్షించగలిగినవాడు. అదిగాక—ఆ జిల్లా మొత్తముమీద చలమయ్య పేరు వినగానే అసహ్యించుకొని పళ్లుకొరికేవాడు ఒక్క చంద్రయ్యే!

ఇతడే తన కన్నివిధములా అనుకూలమైన వ్యక్తి అని వీరాస్వామి భావించుకున్నాడు.

* * * *

అది నవభారతములో ప్రజాప్రభుత్వపు ప్రథమ ఎన్నికల సంరంభ కాలము. అత్యుత్సాహముతో ప్రజలు కేరింతలు కొట్ట నారంభించినారు. ఏభయి సంవత్సరాల శాంతి సమరము తరువాత—నేడు సంపూర్ణస్వాతంత్ర్యము. ప్రజాస్వామ్యము!

తెలిసినవారికీ తెలియనివారికీ ఒకటే సందడి. ఎన్నికలసందడి! ప్రతి గ్రామములోనూ ఎన్నికల ప్రచారము అఖండముగా సాగిపోతున్నది. జీపుకార్లూ—పెద్దకార్లూ—లౌడ్ స్పీకర్ల నలంకరించుకొని—ప్రచారకులతో తిరుగ నారంభించినవి.

'కడుపునిండా అన్నమూ—ఒంటినిండా బట్టా మీకు దొరకవలెనంటే మన జిల్లాలోకి సమర్థుడైన రంగయ్యకే మీఓటు ఇవ్వండి అని కేకలు వేస్తూ ఏభయి మంది జనము కాగితాలను పంచుతూ వీథులవెంబడి బయిలుదేరినారు. ఆ గ్రామములోని పిల్లలు వారిని వెంబడించినారు. ఊరిబైట రచ్చబండ దగ్గర పెద్ద సమావేశము జరిగినది. రంగయ్య ప్రతిభాసామర్థ్యములను గురించి సుమారు ఒకగంటసేపు ఒకరు ఉపన్యసించినారు. గ్రామస్థులకు రంగయ్య పేరు బాగా మనసున పట్టినది.

ఆ గుంపు ఆదినము అక్కడినుండి బయలుదేరి మరునాటికి మరొకగ్రామములో ప్రచారము చేయటానికి ఏర్పాటుచేసుకున్నది.

ఆ మరునాడు ఆ గ్రామములోకి మరొకగుంపు బయలుదేరివచ్చింది. 'బీదజనులకు న్యాయముజరుగవలెనంటే—బీదలు మానవులుగా భావింపబడవలెనంటే—దీనదయాళుడైన వీరాస్వామికే మీ ఓటు నివ్వండి. దాంభికులను నమ్మబోకండి!'

జనసమూహము ముందుకుసాగిపోతున్నకొలదీ-ఆ నినాదాలు ప్రజల హృదయాలలో నాట్యము చేయసాగినవి. 'ప్రతిమనిషికి కడుపులోకి అన్నమూ, ఒంటికి బట్టా ఏర్పాటు చేయకలిగినవాడికే మా ఓటు' అని నిశ్చయించుకొన్న ప్రజలకు-రెండవసారి జరిగిన ప్రచారముతో ప్రథమంలో కలిగిన అభిప్రాయము మారిపోయినది. బీదలను కష్టాలను తొలగించి—బీదలను కూడా మానవులుగా భావించే మహానుభావుడున్నట్లయితే తమ ఓటును ఖండితముగా ఆయనకే ఇవ్వవలెనని ప్రజలు నిశ్చయించుకున్నారు.

మూడవనాడు ఆ గ్రామవీథులలో మరొక సమూహము తిరిగినది.

ఆ సాయంత్రము మరొకటి సంచారము చేసినది. తాము అంతకు పూర్వము చేసిన ఘనకార్యములను విపులీకరిస్తూ కొన్ని జీపుకార్లు గ్రామసంచారము చేసినవి.

ఆ గ్రామములోని ప్రజల ఓట్లకు వారసులనేకులైనారు. ఒక్కొక్క సంస్థ ప్రచారము చేసుకొని—ఓట్లను ఖాయపరచుకొని-సాగిపోయినది.

భుజబలముగల ఏభయిమంది జనముతో

చంద్రయ్య బయలుదేరి గ్రామగ్రామమూ సంచారము సాగించినాడు.

మార్గశిరమాసపు చలి మానవులను గడగడ వణకించి వేస్తున్నది. పుచ్చపువ్వువలె వెన్నెల విరియకాస్తూ ఉండగా చంద్రయ్య వెంబడి బయలుదేరిన జనము ఏలపదాలు పాడుకుంటూ నడుస్తున్నారు. ఇంకా కోసెడు దూరము నడిస్తేనే గాని గమ్యస్థానము చేరుకోనరు. త్వరపడి-చలమయ్యకంటె ఆ గ్రామము చేరుకొని ప్రచారము చేసుకోవాలి.

పొడుగుపాటి కర్రలను చేతపట్టుకొని నలుగురు మనుష్యులు ముందు నడుస్తున్నారు. చంద్రయ్య లంకపొగాకుచుట్టను వెలిగించి గుప్పుగుప్పున పొగ విడుస్తూ - తల వంచుకొని ఆలోచించుతూ - నడుస్తున్నాడు. తక్కినవారంతా ముందుగా వెళ్లినవారిని అనుసరించుతున్నారు.

గ్రామము కనుచూపు మేర వరకూ వచ్చినది. పొలిమేర సమీపములో — ఒక పాకలోనుండి జన సందడి చంద్రయ్యకు వినవచ్చినది.

ఆ సందడి చలమయ్య పార్టీది కాదుగద!

చంద్రయ్య మనసు ఉద్రేకించినది. చలమయ్య కంటె ముందుగా గ్రామము ప్రవేశించవలెనని అతడి ల్పము. ఆ చలమయ్య అదేమి మనిషో - జనాన్ని కణాలమీద కూడగట్టుకొని — తనచేతిక్రింద పెట్టుకుంటాడు! ఎక్కువగా డబ్బైనా ఖర్చుచేయడు!

చంద్రయ్య రక్తము ఉడుకెక్కినది. జేబులోని పైకము గలగలలాడినది. వెంటనే తలమీది ముసుగు తీసి — చంద్రయ్య తన జట్టువారి కందరికీ చేతిసైగ చేసినాడు.

అందరూ ఒక్కపరుగున పాకమీద పడినారు.

* * * *

ఎన్నికలు జరిగేవరకూ చంద్రయ్య ఊళ్లమీద తిరుగుతునే ఉన్నాడు. ఎన్నికల బాబతు పైకము అతడిసంచిలో ఏమాత్రమో నిలచి—అతడిని కలకత్తా పట్టణమువరకూ లాగుకొని పోయినది.

క్రొత్తగా పట్టణపు విశేషాలనూ వింతలనూ చూసి ఆనందిస్తున్న చంద్రయ్య—తిరిగి గ్రామము చేరుకొనటానికి కావలసిన పైకముమాత్రము అట్టిపెట్టుకొని - మిగిలినదంతా ఖర్చుచేయ నారంభించాడు. అతడికా సంబరములో ఎన్నిదినాలు గడచినవో గమనికేలేదు.

ఒకనాటి ఉదయము హోటలులో కాఫీ త్రాగుతుండగా తెలుగు పత్రికలో ఎన్నికల ఫలితాలు పెద్దక్షరాలలో కానవచ్చినవి.

ఓట్లు ఎక్కువ సంఖ్యలో సంపాదించుకొని— ఎన్నుకొనబడిన వ్యక్తి చంద్రయ్య పార్టీకాదు — చలమయ్యది అంతకంటె కాదు — మూడవపార్టీ వ్యక్తి!

చంద్రయ్య మనసు ఒక విధముగా సమాధానము చెందినది. తాను నిలువబెట్టదలచిన వ్యక్తి ఓడిపోయినా చలమయ్యపార్టీ మనిషిమాత్రం గెలువలేదని!

* * * *

చంద్రయ్య ఇంటికివచ్చి విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈసంగతి వీరాస్వామికి తెలిసి చూడటానికి వచ్చాడు.

"నేను రెండుసార్లు మీయింటికి వచ్చాను అయ్యా. నీవు ఊళ్లోలేవా ఏం—కనబడలేదు" అన్నాడు వీరాస్వామి.

"ఆ రోజులలో తిరిగిన తిరుగుడుకు శరీరము చాలా అలసిపోయినది. గాలిమార్చితే బాగుంటుందేమోనని బయలుదేరి వెళ్ళాను" తలవంచుకొని అన్నాడు.

వీరాస్వామికి చంద్రయ్యతో ఏమి మాట్లాడవలెనో తోచలేదు. 'అట్లాగా! ఇప్పుడు ఆరోగ్యము బాగున్నదికదా!' ఈ మాట మాత్రము నిర్వికారముగా అనగలిగాడు.

అయిదునిమిషాలపాటు ఇద్దరిమధ్య నిశ్శబ్దము భరించరానిదిగా తయారుఅయింది. చివరకు చంద్రయ్య 'మాస్తున్నావుగా వీరాస్వామీ! న్యాయముగా గెలవటము చాలా కష్టమైన పని' అన్నాడు ఇంటికప్పును చూస్తూ.

"అవును. ఓడిపోయినాను గనుక న్యాయము నావైపే ఉన్నదనుకోవాలి." తల ఆడిస్తూ వీరాస్వామి గడపదాటి వెళ్లిపోయినాడు.

చంద్రయ్య మాట్లాడకుండా భోజనముచేసి పడుకున్నాడు.

రాత్రి పన్నెండుగంటలవేళ చంద్రయ్యకు నిద్రలో మెలకువ వచ్చింది. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ఎక్కడినుండో ఎవరో మూలిగిన శబ్దము చంద్రయ్యకు వినబడ్డది.

మొదటిసారి రెండవసారి పరాకుగా విన్నాడు.

మూడవసారి నాలుగవసారి బాగా స్ఫుటముగా వినబడ్డది.

మనసుపెట్టి విన్నకొలదీ సమీపమునుండే వినవస్తున్నట్లుగా చంద్రయ్యకు తోచింది. భార్యను లేపి అడిగినాడు.

"మొన్నటి ఎలక్షను గడబిడలో బావగారికి బలమైన దెబ్బలు తగిలాయట. తలమీద పెద్దగాయమైనదట. కాలి ఎముక విరిగినదనుకుంటున్నారు. నిలబడ లేరట. చాల బాధపడుతున్నారట" కండ్లు నులుపుకుంటూ జంకుతూ చెప్పింది భార్య.

'నీకెవరు చెప్పారు?' అన్నాడు ఆశ్చర్యముతో.

'బావగారి రాము చెప్పాడని మన పనీ మనిషి అన్నది. వాళ్ళమ్మ నిద్రాహారాలు లేకుండా ఏడుస్తున్న'దని చెప్పాడట!

అంతలో 'అబ్బా! అని బాధకొద్దీ మూలిగిన శబ్ధము తిరిగి వినపడ్డది.

చంద్రయ్య బలవంతముగా నిద్రపోవటానికి ప్రయత్నించాడు. మూలుగు చెవినపడినప్పుడల్లా దేహము జలదరించి మనసు కలతపడ నారంభించింది.

ఆశబ్దానికీ ఈహృదయానికీ ఏమి సంబంధమో- ఆ మూలుగునకు చంద్రయ్య హృదయములోని నరాలు తోడుపలుక నారంభించినవి.

రెండుచేతులతో తలపట్టుకొని చంద్రయ్యజోరగిల పడుకున్నాడు.

ఈసమయములో తనతల్లే ఉన్నట్లయితే ఆమె హృదయమెంత తరుగుకొని పోయెదో! చలమయ్యనూ చంద్రయ్యనూ గన్నతల్లి శంకరమ్మ ఇద్దరిని చెరి ఒక కన్ను అనుకొనేది. కుమారద్వయము జన్మించిన నెలకే తండ్రి హృద్రోగముతో అకస్మాత్తుగా చనిపోయినాడు. ఆయింటా—ఆయింటాపనిచేసి—వంటలుచేసి బిడ్డలను పెంచుకొన్నది ఆతల్లి. ఆమె నోటి మంచితనమువల్ల బిడ్డలకు రెండు అక్షరపు ముక్కలు అంటి జీవనోపాధులు కలిగినవి.

బాల్యములో అన్నదమ్ములిద్దరికీ - ఇతరులకు అసూయను పుట్టించేంత వాత్సల్యము ఒకరిపైన ఒకరికి ఉండేది. పాతికేళ్ళ కిందట కూడా - తమ్ముడికి జ్వరము రాగానే - ఆదుర్దాతో రెండు మైళ్ళ దూరము నడిచివెళ్ళి అన్న మందు తెచ్చియిచ్చేవాడు. అన్న పథ్యములోకి కావలసిన ఆవుపాలు పొరుగూరినుండి - సూర్యోదయానికి పూర్వమే తమ్ముడు తెచ్చియిచ్చేవాడు. తనకు లభ్యమైన చిరుతిండిని చేతబట్టుకొని అన్న వచ్చేవరకూ ఎదురుచూస్తూ తమ్ముడు వాకిట్లో నిలువబడేవాడు. తమ్మునితో పంచుకొననిదే అన్నకు ఏ వస్తువా సహించేది కాదు. వాళ్ల హృదయాలు పరస్పరమూ మారుమ్రోగుతూ ఉండేవి.

యౌవనము పొడచూపి వ్యక్తిగతజీవితములారంభమయే వరకూ ఏ మార్పూ ఉన్నట్లు కనబడలేదు. ఒకనాడు చంద్రయ్య సామానులకొరకు బజారుకు వెళ్ళాడు. బేరము కాగానే - సెట్టి "బేరములో అన్నయ్యగారిని మించిపోతున్నారే!" అన్నాడు.

"అంటే?"

"అంటే ఏం లేదులెండి. అన్నయ్యగారిది అదోకమాదిరి మనసు" అన్నాడు సెట్టి.

ఇంటికి వస్తూనే చంద్రయ్య తల్లిని భోజనము పెట్టమన్నాడు. "నాయనా! వంట సాంతమయిన తరువాత భోజనము చేతువు గాని. అన్నయ్య కూడా తొందరపడుతున్నాడు. పావుగంట తాళితే అయిపోతుంది" అన్నది.

మాట్లాడకుండా చంద్రయ్య వెళ్లి గదిలో పడుకున్నాడు. అన్నగారి గదిలోనుంచి కిలకిలనవ్వులు వినబడుతున్నాయి. రెండేళ్ళ పిల్లవాడు వచ్చీరాని మాటలలో తండ్రితో దాగుడుమూత లాడుతున్నాడు.

చంద్రయ్య కానాడు మనసు స్వాధీనములో లేదు. కారణమేమో అతడి ఊహ కందలేదు. బాలుడి కేరింతలు ఒకప్పుడు అతనికి ఆనందాన్ని కలిగించినవేగాని యిప్పుడు చిరాకుపరచాయి. అంతలో తల్లి భోజనానికి పిలిచింది— "అన్నయ్య పీటమీద కూర్చున్నాడు. నీవుకూడా రా నాయనా!" అని.

చంద్రయ్య అన్యమనస్కుడై మెల్లగా లేచి పీటమీద కూర్చున్నాడు. చంద్రయ్య భార్య నెయ్యి వడ్డిస్తున్నది. గిన్నె పట్టుకొని చంద్రయ్యదగ్గర ఒక నిమిషముసేపు నిలువబడ్డది. అతడు పరధ్యానములో ఉండగా చూసి బావగారికి నెయ్యి వడ్డించివచ్చి మళ్ళీ నిలువబడ్డది. చంద్రయ్యకు నెయ్యి వేయించుకొన బుద్ధి పుట్టలేదు.

అప్పటికి నాలుగేళ్ళక్రింద పొరుగూరినుండి— రామయ్య తనకూతురిని ఈయింటికి యివ్వవలెనని

అడుగుదామని వచ్చాడు. తల్లి రెండవపిల్లవాడికి—వచ్చే సంవత్సరము ఆ పిల్లను చేసుకొంటానని చెప్పింది. అతడు వినక వచ్చే సంవత్సరమైనా పెద్ద పిల్లవాడికిగాని యివ్వనన్నాడు. తల్లి కాదనలేక పోయినది. నిజానికి ఆ పిల్లదగ్గరికి వరుడు హీనంగా కనబడుతాడు.

చంద్రయ్యకు ఆ విషయము తలవని తలంపుగా అప్పుడు జ్ఞాపకము వచ్చింది. ఆ రామయ్యకు ఇద్దరన్నదమ్ములలో కనబడ్డ వ్యత్యాసమేమిటి? తాను తరువాత ఎకరపు పల్లపుభూమి కట్నము తీసుకొని చక్కని పిల్లనే పెళ్లిచేసుకున్నాడు—కాని ఆ విషయము మాత్రము మరపుకు రావటములేదు.

లోతుగా ఆలోచించితే ఆ సంఘటనలలో ఒక్కటైనా పెద్దకారణ మనిపించుకోదు కాని—ఇవన్నీ అతడి మనసులో ఒకమూల కాపురము చేస్తునే ఉన్నాయి—ఇప్పటికీ.

మధ్యాహ్నము నిద్రపోయి లేచేసరికి భార్య గదిలోకివచ్చి—కాఫీ గ్లాసు చేతికందించింది. 'చక్కెర చాలలేదన్నా'డు, ఆమె అమాయికముగా—'ఎవరూ తక్కువైనదని అనలేదే!' అన్నది. వెంటనే 'అన్నయ్యేనా అనినది?' అన్నాడు.

మరునాటినుంచీ అన్నగారి పిల్లవాడిని ఎత్తుకొని ముద్దులాడుతున్న తన భార్యను—అకారణముగా కోప్పడి—పిల్లవాడిని వదలిపెట్టిరమ్మని అన బుద్ధిపుట్టింది అతనికి.

మనసులో బయలుదేరుతున్న ఆ విప్లవ మేమిటో దాని నామరూపా లేమిటో అతడికి తెలియలేదు కాని—ఆనాటినుండీ అతడి మనసులో ఒక భావము సంచారముచేయ నారంభించినది. సాంసారికముగా—సాంఘికముగా తమ యిద్దరికీగల వ్యత్యాసమూ—తారతమ్యమూ బాగా ప్రచారానికి వచ్చినాయి కదా? ఆ భేదసాదృశ్యాలు ఏవేవి? దాని జవాబు ననుసరించుకొని మరొక ప్రశ్న ఉదయించింది—'అయితే ఏది ఎక్కువ?' అని. స్వాభిమానము నిర్ణయానికి రానివ్వలేదు.

తల్లిపోయిన తరువాత—చంద్రయ్యకు ఏడాది బిడ్డ చనిపోయింది. ఆ ఊరిలో ఎరిగినవాళ్ళంతా ఆడా—మొగా—వచ్చి దంపతులను పలకరించి—సానుభూతి వాక్యాలు పలికి వెళ్ళారు. అన్న చలమయ్య మాత్రము నోటితో తమ్ముడినేమీ పలకరించలేదు కాని—అతడి ఒడిలోనే ఆ బిడ్డ కన్నుమూసింది. చలమయ్యే ఆ బిడ్డను తీసుకొని వెళ్ళాడు. పదిరోజులపాటు తమ్ముడి మంచముదగ్గర మంచము వేసుకొని పడుకొన్నాడు. తమ్ముడిని తన పంక్తికి భోజనానికి కూర్చుండబెట్టుకొని తమ్ముడు నోట్లో ముద్దపెట్టుకొన్న తరువాతనే తాను మెతుకు కొరికేవాడు. అప్పుడు ఇతరుల సానుభూతి వాక్యాలతో తాను అన్న సానుభూతిని పోల్చిచూసుకున్నాడు. అన్న నోటవెంట మాటే రాలేదు.

ఆతరువాతనే ఆ యింటిని రెండు భాగాలుగా పంచుకొని మధ్య తలుపులను బంధించుకొన్నారు. క్రమాగతముగా ఒకరిని చూడగానే మరొకరు ముఖము త్రిప్పుకోవటము కుటుంబములోని శుభాశుభ కార్యములలో ఒకరినొకరు పలుకరించుకొనకుండా ఉండటము జరుగుతూ వచ్చినది. బిడ్డలు మాత్రము ఇంటి ఆవరణములో తప్ప బయట మాట్లాడుకోవటము నిలుపుకొన్నారు.

"అబ్బా! తలపోటు!"

తిరిగి మూలుగు వినపడ్డది.

మంచముమీద పడుకొని సోదరునకూ తనకూగల గుణభేదాలను గురించి ఆలోచిస్తున్న చంద్రయ్య మూలుగును విన్న తరువాత మంచముమీద లేచి కూర్చున్నాడు.

గోడగడియారము ఖంగు ఖంగున రెండుగంటలు కొట్టింది.

"అమ్మా! ఊ!"

చంద్రయ్య దిగ్గున లేచి నిలువబడి—రెండునిమిషాలపాటు యోచించి—దక్షిణపు దిశన బంధించి ఉన్న తలుపును తెరువప్రయత్నించినాడు. ఆ తలుపులను బంధించి ఎనిమిది సంవత్సరాలకు పైగా కావటము వలన—గొడ్డలి సహాయముతో గాని గడియ పైకి లేచినది కాదు.

కరదీపిక చేత పట్టుకొని—సావడిలోనుండి—చంద్రయ్య గదిలోకి వెళ్ళి నిలువబడినాడు.

ఒక మూల సన్నగా దీపము వెలుగుతున్నది. మంచముమీద అన్న పండుకొని మూలుగుచున్నాడు. తలకూ కాలికీ కట్లుకట్టి ఉన్నాయి. వదినెగారు రోగికి విసరుతూ దగ్గరకూర్చున్నది.

చంద్రయ్య చేతిలో వున్న కరదీపిక చేయిజారి నేలమీద పడ్డది. అన్నను ప్రత్యక్షముగా చూసిన తమ్ముడు "చలమన్నయ్యా!" అంటూ మంచముమీద ఉన్న రోగిపైన బడి—తన హృదయానికి అతడిని అదుముకున్నాడు.

"తలబాధరా చంద్రీ! తలబాధరా!" తమ్ముని తన బాహువులతో బంధించుకొన్నాడు చలమయ్య.

అన్నదమ్ముల కౌగిలింతను గాంచిన తోటికోడళ్ల హృదయాలలో 'ఎంతయినా వాళ్ళు ఒక తల్లిపిల్లలు!' అన్న భావము మెరపువలె మెరసింది.